
సాక్షి పల్నాడు

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



నేడు పూర్ణాహుతి


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో బుధవారం పూర్ణాహుతి జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.7,800, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
నరసరావుపేట	6:28	4:42
గుంటూరు	6:26	4:43
బాపట్ల	6:26	4:43

న్యూస్‌రీల్

కొనసాగుతున్న పెన్షన్ పంపిణీ



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ మంగళవారం కొనసాగింది. లబ్ధిదారుల వేలి ముద్రలు, ఐరిష్ ఆధారంగా వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించారు. జిల్లాలో మంగళవారం 70.66 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,52,367 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.34 కోట్లు కేటాయించింది. సాయంత్రానికి 1,78,335 మంది లబ్ధిదారులకు రూ.49.18 కోట్లు అందజేశారు.

54.0 మిల్లీమీటర్ల వర్షపాతం

బొల్లాపల్లి: మండలంలో అకాల వర్షం పడింది. మండలంలో 54.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఈదురు గాలులతో ఎడతెరిపి లేకుండా ఒక గంటపాటు కురిసిన వర్షానికి వెల్లటూరు, నాయుడుపాలెం, గ్రామ పరిసరాల్లో కోత కోసి కొన్ని కల్లాలు ఆరబెట్టిన మిర్చి తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తులు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు సంస్థ సీఈఓ ఎస్. పల్లవి, డీఎస్ఏ స్టేడియం చీఫ్ కోచ్ చావలి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ మే ఒకటో తేదీ నుంచి 31 వరకు ఉంటుందని చెప్పారు. పల్నాడు జిల్లా పరిధిలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న క్రీడా అసోసియేషన్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు ఈనెల 5వ తేదీ సాయంత్రం 5గంటలలోగా స్టేడియంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు..

తాడికొండ: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థతో నిర్వహించబడుతున్న తాడికొండ గురుకుల పాఠశాల (రీజనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ- బాలురు) లో 2023-24 విద్యా సంవత్సరానికి 5,6,8 తరగతులకు మిగిలిన ఖాళీలకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ బాలశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మంగళవారం నుంచి 24వ తేదీ వరకు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే, 5న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రెస్టారెంట్‌లపై కేసు నమోదు



గుంటూరు మెడికల్: గుంటూరు నగరంలో పలు రెస్టారెంట్‌లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మంగళవారం కేసులు నమోదు చేశారు. నిబంధనల ప్రకారం వంట నూనెను పలు మార్లు వేడి చేసి వినియోగించకూడదు. కాని గుంటూరు నగరంలోని నగరంపాలెం మస్తాన్‌దర్గా సమీపంలోని మ్యాక్‌డోనాల్డ్ రెస్టారెంట్‌లో పలు మార్లు మరిగించిన నూనెను వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ షేక్ గౌస్ మొహిద్దీన్ తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన సదరు రెస్టారెంట్‌పై కేసు నమోదు జాయింట్ కలెక్టర్ కోర్టుకు నివేదిక అందజేశామన్నారు. అదే విధంగా ఇటీవల కాలంలో జేకేసీ కళాశాల రోడ్డులోని ఓరియన్ రెస్టారెంట్‌లో కూడా తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా మరిగించిన నూనె వినియోగిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామని చెప్పారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 528.60 అడుగుల వద్ద ఉంది. ఇది 165.4272 టీఎంసీలకు సమానం. జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,351, ఎస్ఎల్‌బీసీకి 1,350, వరద కాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లోగా 6,021 క్యూసెక్కులు విడుదలవుతోంది.

అభివృద్ధే తొలి ప్రాధాన్యం

- పల్నాడు జిల్లాకు సీఎం వైఎస్ జగన్ అన్ని విధాల సహకారం
- సంక్షేమ పథకాల జోరు
- పల్నాడు జిల్లా ప్రథమ వార్షికోత్సవ సభలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- పల్నాడు లోగో, నూతన గేట్, పార్కింగ్ ప్రదేశాలు ప్రారంభం



జిల్లా ప్రథమ వార్షికోత్సవ సభలో జిల్లా లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రులు కారుమూరి, అంబటి, జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, బొల్లా, ఎమ్మెల్సీలు జంగా, కేఎస్ లక్ష్మణ్‌రావు, పొడా చైర్మన్ మిట్టపల్లి, జెడ్పీటీసీలు, అధికారులు

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా ప్రథమ వార్షికోత్సవం నరసరావుపేట కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, ప్రభుత్వ విప్‌లు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, కలెక్టర్ శివశంకర్ లోతేటి, జేసీ శ్యాంప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ పల్నాడు జిల్లాను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రత్యేక అభిమానంతో అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాల సహకారం అందిస్తున్నారని వెల్లడించారు. ఈ జిల్లా మీద ప్రేమతో రెండు కీలక శాఖల మంత్రి పదవులను సీఎం కేటాయించినట్లు చెప్పారు. ఎన్ని కష్టాలు ఉన్నా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు టీం వర్క్‌తో కలసి పనిచేసి జిల్లాను ముందుకు తీసుకెళ్తున్నట్లు వివరించారు.



కలెక్టర్ ట్రోఫీ విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, కలెక్టర్ శివశంకర్ తదితరులు

చిరకాల కోరిక నెరవేరింది



పల్నాడు ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. ఎప్పుడి నుంచో వెనకబడిన ప్రాంతంగా గుర్తించారు. కానీ తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదు. కొత్త జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. అందుకు సీఎం జగనన్నకు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్, ఇతర అధికారులు జిల్లా అభివృద్ధికి బాగా కృషి చేస్తున్నారు. ఇదే విధం పనులు కొనసాగించాలి.

–జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ

పెండింగ్ పనులు పూర్తికావాలి



పల్నాడు అభివృద్ధికి సాగు నీరు, విద్యావకాశాలు ఎంతో కీలకం. ఈ రంగాల్లో ఉన్న పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తగిన ప్రణాళిక అమలు చేయాలి. వలసలు నివారించేందుకు ఉపాధి హామీ పథకాన్ని పగడ్బందీగా అమలు చేసి, అభివృద్ధిని పరుగులు పెట్టించాలి. అప్పుడే పల్నాడు అభివృద్ధి చెందుతుంది.

– కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

తొలి కలెక్టర్‌గా అవకాశం అదృష్టం



పల్నాడు జిల్లా తొలి కలెక్టర్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం ఇవ్వడం నా అదృష్టం. అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో జిల్లాకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్ లభించింది. రానున్న కాలంలో మరింతగా కృషి చేసి అన్ని విధాల రాష్ట్రంలో ప్రథమ స్థానంలో జిల్లాను నిలుపుతాం.

– శివ శంకర్ లోతేటి, జిల్లా కలెక్టర్

జిల్లా అభివృద్ధికి కృషి



పల్నాడు ప్రాంత అభివృద్ధికి జిల్లా పరిషత్ నిధులు తగిన విధంగా అందించేందుకు కృషి చేస్తాం. ఇప్పటికే ఇక్కడి ప్రజాప్రతినిధుల కోరిక మేరకు అడిగిన వెంటనే పనులు మంజూరు చేస్తున్నాం. భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాలను జెడ్పీ సారథ్యంలో నిర్వహించేందుకు కృషి చేస్తాం. ప్రజా ప్రతినిధుల సహకారం మాకు అవసరం. అభివృద్ధి పనులకు సహకరం అందించండి.

–కె.హెనీ క్రిస్టినా, జెడ్పీ చైర్‌పర్సన్

వినూత్న కార్యక్రమాలకు వేదిక



పల్నాడు జిల్లా ఏర్పటుతో మాచర్ల లాంటి దూర ప్రాంత ప్రజలకు జిల్లా కేంద్రం చేరువైంది. అన్ని పనులు సులభంగా వేగంగా జరుగుతున్నాయి. సమయం, ఖర్చు ఆదాయ అవుతోంది. స్పందన, నవోదయం, గ్రామోదయం లాంటి వినూత్న కార్యక్రమాలకు పల్నాడు వేదిక అయింది. ప్రభుత్వ అధికారులు సమష్టిగా కష్టపడి పనిచేస్తున్నారు. త్వరలో నరసరావుపేట, మాచర్లలో ఏఎన్‌యూ పీజీ సెంటర్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే, నరసరావుపేట

వికేంద్రీకరణతోనే అభివృద్ధి



పరిపాలన వికేంద్రీకరణ జరగాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన. అందులో భాగంగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. ఆ ఫలాలను ప్రజలు ప్రస్తుతం అనుభవిస్తున్నారు. మూడు రాజధానులు ఏర్పాటు కూడా వికేంద్రీకరణలో భాగమే. వచ్చే ఎన్నికల్లో కూడా జగనన్న ప్రభుత్వమే వస్తుంది. అన్ని ప్రాంతాలు అభివృద్ధి అవుతాయి. అవ్వతాతల నుంచి అందరూ ఆనందంగా ఉన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందుతోంది. చంద్రబాబు ప్రభుత్వంలో నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు ఎందుకో నిండవు, మన ప్రభుత్వంలో ప్రతి ఏడాది నిండి రైతులు సుభిక్షంగా ఉంటున్నారు.

–అంబటి రాంబాబు, మంత్రి, జల వనరుల శాఖ

జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



పల్నాడు జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల కట్టుబడి ఉంది. గురజాల మెడికల్ కళాశాల పనులు వేగంగా సాగుతున్నాయి. మాచర్ల, వినుకొండ ప్రాంత ప్రజల చిరకాల కోరికైన వరికపూడిశల ప్రాజెక్టుకు త్వరలో అన్ని అనుమతులు రాగానే పనులు ప్రారంభించనున్నాం. మాది చేతల ప్రభుత్వం. అన్ని విధాల ప్రజలకు మేలు చేస్తోంది. ప్రతిపక్షాల అసత్యప్రచారాలను ఉద్యోగులు నమ్మవద్దు. మీరంటే జగనన్నకు అభిమానమని, కరోనా లాంటి విపత్తుల వల్ల మీరుకోరుకున్నంత లబ్ధిచేకూర్చలేకపోతున్నారు. కాస్త ఓపిక పడితే అన్ని కోరికలను సీఎం తీర్చుతారు.

–పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), ప్రభుత్వ విప్

ప్రజలకు పాలన చేరువైంది



పల్నాడు జిల్లా ఏర్పడుతుంది, నరసరావుపేట జిల్లా కేంద్రమవుతుందని కలలో కూడా అనుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి అమలు చేశారు. కొత్త జిల్లా ఏర్పాటుతో పాలన చేరువైంది. వెనకబడిన ప్రాంతం నుంచి అభివృద్ధి వైపు దూసుకెళ్తున్నాం. పల్నాడు అంటే పౌరుషాలే కాదు ప్రేమలకు పుట్టినిల్లు.

– బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్యే, వినుకొండ

పంటల రుణ పరిమితి పెంపు

- 2023-24లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేస్తూ ఉత్తర్వులు
- మే నుంచి ఖరీఫ్, అక్టోబర్ నుంచి రబీ రుణాలు మంజూరు
- అర్హులైన రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు
- సకాలంలో రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ

కొరిటిపాడు(గుంటూరు): వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో 2023-24 సంవత్సరానికి గాను పంటల వారీగా రుణ పరిమితి(స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారు చేస్తూ రాష్ట్ర స్థాయి టెక్నికల్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బ్యాంకుల ద్వారా రైతులు పంట రుణాలు పొందవచ్చు. ఏ పంటకు ఎంత రుణం ఇవ్వాలనే విషయమై జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశమై నివేదిక రూపొందించింది. ఈ నివేదికను రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపగా అక్కడ నివేదికపై చర్చించి ఆయా పంటలకు రుణ ప్రణాళికను విడుదల చేశారు. ఏడాది కేడాది పెట్టుబడి వ్యయం, కూలీల ఖర్చు పెరుగుతుండటంతో వాటిని పరిగణలోకి తీసున్నారు. పంట రుణ పరిమితిని ఒక ఎకరాకు నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా బ్యాంకులు ఖరీఫ్, రబీ సీజన్లకు రుణాలు మంజూరు చేస్తాయి. మే నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్‌గా, అక్టోబర్ నుంచి మార్చి వరకు రబీ సీజన్‌గా పరిగణించి రుణ ప్రణాళిక అమలు చేస్తారు. పంట రుణపరిమితి ఆధారంగా ఏడాది కార్యాచరణ రుణ ప్రణాళికను లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో తయారు చేశారు.

కిసాన్ క్రెడిట్ కార్డులు..

అర్హులైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేయాలనే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఈ కార్డుల కింద గరిష్టంగా ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం అందజేస్తారు. అందుకు 7 శాతం వడ్డీ వసూలు చేయనున్నారు. ఏడాది లోగా రుణం తిరిగి చెల్లిస్తే వడ్డీలో 3 శాతం రాయితీ బ్యాంకు అందజేస్తుంది. రూ.లక్ష లోపు రుణం ఏడాదిలోగా చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది. దీంతో రూ.లక్ష వరకు రుణం తీసుకున్న రైతు సకాలంలో చెల్లిస్తే వడ్డీ భారం నుంచి మినహాయింపు పొందే అవకాశం ఉంది.

అర్హులైన ప్రతి రైతుకు రుణం...



జిల్లాలో అర్హులైన రైతులందరికీ పంట రుణం అందజేయడమే లక్ష్యంగా రుణ ప్రణాళిక తయారు చేశాం. కిసాన్ క్రెడిట్ కార్డులకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. రుణం ఏడాదిలోగా చెల్లిస్తే వడ్డీ కట్టాల్సిన అవసరం ఉండదు. రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకుని ఇబ్బందులు పడకుండా.. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని వడ్డీ రాయితీ పొందాలి. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఈదర రాంబాబు, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్, గుంటూరు జిల్లా.

రీసర్వేతో భూములపై స్పష్టమైన లీగల్ రైట్స్

ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి



మాట్లాడుతున్న ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, వేదికపై ఎమ్మెల్యే సుచరిత, జేసి రాజకుమారి

ప్రత్తిపాడు: భూ యజమానులకు భూములపై వివాదాల్లేని స్పష్టమైన లీగల్ రైట్స్ కల్పించడమే లక్ష్యంగా భూముల రీ సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం గారపాడులో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకంలో భాగంగా చేపట్టిన భూముల సమగ్ర రీ సర్వే ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట ఎమ్మెల్యే సుచరిత, జాయింట్ కలెక్టర్ రాజకుమారి ఉన్నారు. సర్వే పరికరాలతో పాటు సర్వే సిబ్బంది ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. రోవర్‌ల పనితీరు, డ్రోన్‌ల ద్వారా జరుగుతున్న సర్వే ప్రక్రియను అధికారులు నాగిరెడ్డికి వివరించారు. అనంతరం రైతులతో మాట్లాడి సర్వే పరంగా క్షేత్ర స్థాయిలో వారు ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులకు అక్‌నాలెడ్జ్‌మెంట్ పత్రాలను అందించారు. ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ గ్రామాల్లో దశాబ్దాల తరబడి కుప్పలు తెప్పలుగా ఉన్న భూ సమస్యలకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకే సుమారు రూ.వెయ్యి కోట్లతో అత్యాధునిక పరిజ్ఞానంతో సమగ్ర రీసర్వేను జగన్‌మోహన్‌రెడ్డి చేయిస్తున్నారన్నారు. జేసీ రాజకుమారి మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లాలో 223 రెవెన్యూ గ్రామాల్లో 5.95 లక్షల ఎకరాలకు గాను, సీఆర్‌డీఏ, మున్సిపాలిటీల్లో 1.85 లక్షల ఎకరాలు మినహాయిస్తే, మిగిలిన 170 గ్రామాల్లో 4.70 లక్షల ఎకరాల్లో రీ సర్వే జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, గుంటూరు ఆర్డీఓ ఎం.ప్రభాకర్ రెడ్డి, స్పెషల్ కలెక్టర్ ఎంవీఎస్ రామిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుజాత, సర్వే ల్యాండ్ రికార్డ్ ఏడీ బి.నాయక్, సైంటిస్ట్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచి సుబ్బారెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి, పార్టీ నాయకులు మన్నవ వీరనారాయణ, చిలకా సుబ్బారావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



లింగంగుంట్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డికి సూచనలు చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



విభాగాల వారీగా ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

సీఎం వైఎస్ జగన్ పర్యటన వివరాలు

చిలకలూరిపేట: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

- గురువారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి తాడేపల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- అక్కడి నుంచి 9.40కు బయలు దేరి 10 గంటలకు లింగంగుంట్ల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులతో మాట్లాడి లింగంగుంట్లలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్‌కు చేరుకుంటారు.
- విలేజ్ హెల్త్ సెంటర్ పరిశీలన అనంతరం 10.25కు సమీపంలోని ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ స్టాళ్లను పరిశీలించనున్నారు.
- 10.42కు సభా ప్రాంగణానికి చేరుకుంటారు.
- 11 గంటల నుంచి 11.30 వరకు సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. -11.40కు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ స్థానిక నాయకులతో మాట్లాడి మధ్యాహ్నం 12 గంటలకు తాడేపల్లికి తిరుగు ప్రయాణం అవుతారు.

నేటి నుంచి ‘జగనన్న సంక్షేమ నవోత్సవాలు’

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

పట్నంబజారు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ‘జగనన్న సంక్షేమ నవోత్సవాలు’ నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. కృష్ణనగర్‌లోని ఆయన కార్యాలయంలో పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి 14వ తేదీ వరకు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమాల్లో అనుబంధ విభాగాల పాత్ర ఎంతో కీలకమన్నారు. అటువంటి పరిస్థితుల్లో వారిని మరింత చైతన్య పరిచే దిశగా, ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు అనుబంధ విభాగాల జిల్లా కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దానిలో భాగంగా ఏప్రిల్ 5న భారత దేశ పరిపాలన రంగంలో బాబు జగ్జీవన్‌రావ్ పాత్ర, 6వ తేదీన జగనన్న పాలన– రైతు సంక్షేమం, 7న జగనన్న పాలనలో విద్యా విప్లవం, 8న లా నేస్తం - పరిపాలన న్యాయ సంస్కరణలు, 9న జగనన్న పాలనలో వైద్య సంస్కరణలు, 10న గ్రామ పరిపాలన సంస్కరణలు, 11న జగనన్న పాలన, బీసీ సంక్షేమం, 12న జగనన్న పాలనలో యువత సాధికారత, 13న జగనన్న పాలనలో మహిళ సాధికారత పేరుతో సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పది రోజుల పాటు జరిగే కార్యక్రమాలు బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రీజనల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు సమావేశాలు జరుగతాయని వివరించారు.

వైభవం.. ప్రథమ వార్షికోత్సవం


లింగంగుంట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి శివప్రసాదుకు కలెక్టర్ ట్రోఫీని అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, బొల్లా, ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, జంగా


క్రికెట్ క్రీడలో విజేతలకు కలెక్టర్ ట్రోఫీ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు

- పల్నాడు జిల్లా ఆవిర్భావ కేక్‌ను కట్ చేసిన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు
- ఫుడ్‌కోర్టు, ఛాయాచిత్ర ప్రదర్శన శాల ప్రారంభం
- పూర్ణకుంభం, లోగో ఆవిష్కరణ
- నవోదయం కింద 17 మందికి వాహనాలు అందజేత

నరసరావుపేట: పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సారధ్యంలో నిర్వహించిన ప్రథమ వార్షికోత్సవం నాయకులు, అధికారులు, ప్రజల కోలాహలం నడుమ అత్యంత రమణీయంగా, వైభవోపేతంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పౌర సరఫరాలశాఖ మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినాలు విశిష్ట అతిథులు, ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రవేశద్వారం ముందు ఏర్పాటుచేసిన పార్కు, అందులోని ప్రథమ వార్షికోత్సవం గుర్తుగా ఏర్పాటుచేసిన నాలుగు సింహాల ప్రతిమలతో కూడిన పూర్ణకుంభాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ బంగ్లా ముందు ఏర్పాటుచేసిన ఫుడ్‌కోర్టు, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికోసం నిర్వహిస్తున్న నవోదయంలో 17మంది లబ్ధిదార్లకు 45శాతం సబ్సిడీపై మంజూరు చేసిన 17 వాహనాలను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించి వారి చేతికి తాళాలు అందజేశారు. పౌరసంబంధాల శాఖ ఏర్పాటుచేసిన ఛాయా చిత్ర ప్రదర్శన శాలను ప్రారంభించి అందులో గతేడాదిగా నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటుచేసిన ఫొటోలను తిలకించారు. సభా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించగా అతిథులు, విశిష్ట అతిథులు పాల్గొని ఆవిర్భావ కేక్‌ను కట్‌చేసి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలను తెలియచేశారు. ఈసందర్భంగా రూపొందించిన జిల్లా లోగోను ఆవిష్కరించారు. సభానంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ చూపించిన 40మంది అధికారులు, ఉద్యోగులు, వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో విజేతలైన క్రీడాకారులకు కలెక్టర్ ట్రోఫీలను అందజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి పల్నాడు జిల్లాపై రాసిన కవితను చదివి వినిపించగా, వికటకవి వెంకటరెడ్డి సీస పద్యం చదివి వినిపించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డీఆర్‌ఓ కె.వినాయకం, పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, ఖనిజ శాఖ పీడీ గాదె సుజాత, వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఐ.మురళి, డీడీ మహాలక్ష్మి, జెడ్పీటీసీలు పదముత్తం చిట్టిబాబు, పిల్లి ఓబుల్‌రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏఓ అనిల్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

2030 నాటికి గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యం

అదిపూడి(కారంచేడు): 2030 నాటికి గాలికుంటు రహిత దేశంగా చేయడమే లక్ష్యంగా పశుసంవర్ధక శాఖ తీవ్రంగా కృషి చేస్తోందని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఆదిపూడి గ్రామంలో బాపట్ల జిల్లా మొదటి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన 'పశు విజ్ఞాన బడి' కార్యక్రమాన్ని ప్రారంభించి, పశుపోషకులు, రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో ఎన్నడూ జరగని విధంగా ఈ ప్రభుత్వం రైతులకు, పశుపోషకులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో జిల్లాలో 408 ఆర్‌బీకేలను ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా పశుపోషణకు అవసరమైన విధంగా వెటర్నరీ అసిస్టెంట్‌లు, గోపాలమిత్రలను నియమించిందని తెలిపారు. వీరి ద్వారా పశువులకు సైతం గ్రామంలోనే వైద్యం అందించే ఏర్పాట్లు చక్కగా జరుగుతున్నాయన్నారు. గతంలో గాలికుంటు వ్యాధి సోకితే ఆ పశువుకు ప్రాణం పోవడం కంటే దాని ద్వారా జరిగే నష్టం ఎక్కువగా ఉండేదన్నారు. 2022–2023 వరకు జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదని, రాబోవు 2025 నాటికి సంపూర్ణంగా రాష్ట్రంలో వ్యాధి లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక 'ఆసరా'


పొదుపు సంఘాల మహిళలకు ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

- పేద ప్రజల శ్రేయస్సే సీఎం జగన్ లక్ష్యం
- ఆసరా చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ పీఆర్కే

రెంటచింతల: రాష్ట్రంలోని అన్ని వర్గాలలో ఉన్న పేద ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా అనేక పథకాలను అమలుచేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక శివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలకు ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడవ విడతగా మంజూరు చేసిన రూ.7,22,37,634 చెక్కును ఆయన అందజేసి మాట్లాడారు. అక్కాచెల్లెమ్మలకు అండగా సీఎం వైస్ జగన్ వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా కల్పించారన్నారు. మండలంలోని 738 స్వయం సహాయక సంఘాలలోని 7088 మంది మహిళలకు సంబంధించి ఈ ఏడాది వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.7,22,37,634, స్త్రీ నిధి ద్వారా 253 స్వయం సహాయక సంఘాలలోని 1009 మంది సంఘ సభ్యులకు రూ.4.47 కోట్లు ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. మండలంలోని అక్కచెల్లెమ్మలకు కలలో కూడా ఊహించని విధంగా మూడు విడతలుగా మొత్తం రూ.21.67 కోట్లు వైఎస్సార్ ఆసరా ద్వారా పంపిణీ చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా ప్రతి సంక్షేమ పథకాన్ని చెప్పిన సమయానికి 100 శాతం అమలు చేస్తూ దేశానికే రాష్ట్రాన్ని ఒక రోల్‌మోడల్ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మంచి మనస్సుతో ప్రజలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌ను అప్రదిష్టపాలు చేయడానికి చంద్రబాబు, ఆయన భజన బృందం చేసే విమర్శలను నమ్మవద్దన్నారు. 2024లో కూడా మరోసారి వైస్ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. తొలుత డ్వాక్రా మహిళలతో కలిసి పీఆర్కే సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యేను డ్వాక్రా సంఘాల సభ్యులు ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీడీఓ షేక్ గౌసియాబేగం, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పూజల రామయ్య, సర్పంచ్‌లు, మాచర్ల ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, ఏపీఎం చిన్నబాబు, పార్టీ నేతలు నవులూరి భాస్కర్ రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, మోర్తల ఉమ తదితరలున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

11 మంది పందెం రాయుళ్లు అరెస్ట్..
10 సెల్‌ఫోన్‌లు, 9 బైక్‌లు, 2 పందెం కోళ్ల స్వాధీనం

పెదకాకాని: కోడిపందేల స్థావరంపై నిర్వహించిన దాడుల్లో 11 మంది కోడిపందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు శివార్లలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు మంగళవారం స్థావరంపై పోలీసులు నిర్వహించిన దాడుల్లో 11 మంది కోడిపందేలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 10 సెల్‌ఫోన్‌లు, 9 బైక్‌లు, రూ.39,890 నగదు, 2 పందెంకోళ్లు స్వాధీనం చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. ఈ దాడుల్లో పాల్గొన్న ఎస్ఐ పొదర్తి కోటేశ్వరరావు, సిబ్బందిని సీఐ అభినందించారు.

అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి

రాష్ట్ర మార్కెటింగ్, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



పర్చూరు: చారిత్రాత్మకంగా పేరొందిన జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మార్కెటింగ్ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి తెలిపారు. జిల్లా తొలి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. బాపట్ల భావపురిగాను, చీరాలను క్షీరపురిగాను, స్వర్ణను స్వర్ణపురిగాను, ఉప్పుటూరును లవణపురిగాను, చెరుకూరును ఇక్ష్వాపురిగాను, కొవ్వూరు గ్రామాన్ని శృంగపురిగా చారిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన దేవాలయాలు ఎన్నో ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. చెరుకూరు అంటే ఇక్ష్వాపురి గ్రామంలోని అగస్త్యేశ్వర త్రివిక్రేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న శిల్ప సంపద ఎక్కడా లేదన్నారు. మూడేళ్లుగా ఈ ఆలయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో ఆదాయం కోటి రూపాయలు పైన నిల్వ ఉందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఈ ప్రాంతంలోని దేవాలయాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా దేవదాయశాఖ మంత్రి ఉండడంతో ఆలయాలు అభివృద్ధి అయ్యేందుకు ఆస్కారం ఉందన్నారు. జిల్లాలో సముద్ర తీరప్రాంతం కూడా ఎక్కువగానే ఉందని, సూర్యలంక బీచ్, చీరాల ఓడరేవు, పెద గంజాం ఇలా ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నో సహజవనరులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో అన్నదాతలు కూడా ఎక్కువగా ఉన్నారని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో వారు సైతం సుభిక్షంగా ఉన్నారన్నారు. బాపట్లను జిల్లా చేయాలని 50 ఏళ్ల క్రితమే కోన ప్రభాకరరావు, కొల్లా వెంకయ్య ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు.

గంజాయికి బ్రాండ్ అంబాసిడర్ యరపతినేని

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: గుంటూరులో నివాసముంటూ గంజాయి అమ్ముకుని బతికే టీడీపీ నేత యరపతినేని శ్రీనివాసరావు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని, గంజాయికి బ్రాండ్ అంబాసిడర్ యరపతినేని అని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయి అమ్ముకుని బతికే చరిత్ర ఎవరికి ఉందో నియోజకవర్గంలోని ఏ ఒక్కరిని అడిగినా టక్కున యరపతినేని పేరు మాత్రమే చెబుతారని, యరపతినేని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 2016లో దాచేపల్లి నడిబొడ్డులో ఆయన పెట్టించిన పేకాటక్లబ్‌లో 244 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకుంది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గంజాయి అమ్ముతూ పట్టుబడిన వెంకటేష్ యరపతినేని కుమారుడు నిఖిల్‌కు అత్యంత సన్నిహితుడని, గంజాయి వ్యవహారాల్లో వెంకటేశ్‌కు యరపతినేని కుమారుడికి ఆర్థిక లావాదేవీలు ఉన్న మాట వాస్తవం కాదా అని ఆయన అన్నారు. గురజాలలో గంజాయి అమ్ముతూ పట్టుబడిన యరపతినేని అనుచరుడైన మాజీ సర్పంచి కుమారుడు శ్రీనునాయక్ ప్రస్తుతం జైలులో ఉన్నాడని, గంజాయిని అమ్మిస్తూ గుంటూరులో ఆస్తులు కూడబెట్టుకోవటం యరపతినేనికే చెల్లిందని ఎమ్మెల్యే కాసు ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గంలో గతంలో జరిగిన అసాంఘిక కార్యక్రమాలన్నిటికీ చెక్ పెట్టామని, అభివృద్ధితో ప్రజలకు దగ్గరవ్వటమే తమకు తెలుసునని ఎమ్మెల్యే కాసు అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు ఎవరు చేసినా, ఏ పార్టీవారైనా కఠిన చర్యలు తీసుకునేలా అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చామని, నీతి, నిజాయితీ జీవించే మా విధానం, నిబద్ధత ఎన్ని జన్మలెత్తినా యరపతినేనికి రాదని ఎమ్మెల్యే కాసు పేర్కొన్నారు.

పిడుగురాళ్లలో భారీ వాహనాలను నియంత్రించండి

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డికి గురజాల ఎమ్మెల్యే కాసు వినతి


ఎస్పీ రవిశంకర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట: పిడుగురాళ్ల పట్టణ ప్రజలకు పెద్ద సమస్యగా తయారైన భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 216 కిలోమీటర్ల అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారి 2013 నాటికి ఓ నిర్మాణ సంస్థ 210 కిలోమీటర్ల వరకు దాదాపుగా పూర్తిచేసిందన్నారు. అందులో పిడుగురాళ్ల పట్టణంలోగుండా భారీ వాహనాలు వెళ్లకుండా బైపాస్‌రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో పదేళ్ల నుంచి ఈ బైపాస్‌రోడ్డు నిర్మాణం ఆలస్యమవుతుందన్నారు..
బైపాస్ నిర్మాణం కోసం భూసేకరణ, రైల్వే చార్జీలు చెల్లించాల్సి ఉండగా 2019 వరకు గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో పనులు జరగక నిర్మాణ ధరలు రెండు మూడు రెట్లు పెరిగిపోయాయని నిర్మాణ సంస్థ చెబుతుందన్నారు. భారీ వాహనాలన్నీ పట్టణంలో నుంచి వెళుతుండడంతో ప్రజలకు చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. పిడుగురాళ్లలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటలవరకు భారీ వాహనాలు పట్టణంలోనికి రాకుండా చేయాల్సిన అవసరం ఉందని ఎస్పీని కోరారు. కాసు వెంట పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నకిలీ పాస్ పుస్తకాలతో బ్యాంకు రుణం

పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు.. పరారీలో ఇద్దరు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు, ముసుగులో నిందితులు

నూజెండ్ల: నకిలీ పాస్‌పుస్తకాలు బ్యాంకులో పెట్టి రూ. 76 లక్షలు రుణం తీసుకుని బ్యాంకును మోసం చేసిన నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. వినుకొండ రూరల్ సీఐ రమేష్‌బాబు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శావల్యాపురం మండలం పిచుకల పాలెం గ్రామానికి చెందిన తిరువీధి అశోక్, రవితేజ, యోగయ్య, తూమాటి వెంకటేశ్వరరావు, బోడేపూడి వెంకయ్యలతోపాటు వినుకొండ మండలం నరదాయపాలెం గ్రామానికి చెందిన చిన్న అంజయ్యలను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు 2016 నుంచి 2019 సంవత్సరాల వరకు నకిలీ పాస్‌పుస్తకాలు తయారీ చేసి శావల్యాపురం మండలంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో రూ. 76 లక్షలు రుణం తీసుకున్నారు. అయితే రుణం చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలో దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. శావల్యాపురం ఎస్ఐ గల్లా రవికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్య సమాజాభివృద్ధికి దోహదపడాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ రెడ్డి

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి తాము చదువుకున్న విద్యతో ప్రాక్టికల్‌గా మంచి ప్రాజెక్ట్‌లను నెలకొల్పి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించి, సమాజాభివృద్ధికి దోహదపడాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాంఫాం నందున్న ఆడిటోరియంలో కమ్యూనిటీ సైన్స్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని జాతీయస్థాయిలో ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. కళాశాల డీన్ డాక్టర్ సీహెచ్ చిరంజీవి మాట్లాడుతూ కళాశాలలో ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించే దిశగా విద్యాబోధన చేసిన అధ్యాపకులను అభినందించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ చైతన్యకుమారి మాట్లాడుతూ ఏడాది కాలంలో విద్యార్థులు సాధించిన కృషిని తెలియజేస్తూ అభినందించారు. అనంతరం వీసీ చేతుల మీదుగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తెగిపడి అరటితోట దగ్ధం



తాడేపల్లిరూరల్: మంగళగిరి – తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మెల్లెంపూడిలో మంగళవారం విద్యుత్ తీగలు తెగడంతో ఓ అరటితోట పూర్తిగా దగ్ధమైంది. సేకరించిన వివరాల ప్రకారం బొమ్మారెడ్డి దామోదరరెడ్డికి చెందిన పంట పొలంలో నుంచి వ్యవసాయ సంబంధిత విద్యుత్ లైన్లు వెళుతున్నాయి. విద్యుత్ తీగలు కండెన్సర్ వద్ద మంటలు చెలరేగి తీగలు తెగి అరటి తోటపై పడడంతో నిమిషాల వ్యవధిలో ఎకరంన్నరలో ఉన్న అరటితోట పూర్తిగా దగ్ధమైంది. ఇప్పుడిప్పుడే పంట చేతికి వస్తోందని, చెట్లు తగలబడడంతో అరటి గెలలు పొగచూరుకున్నాయని, ఒక గెల కూడా పనికి రాదని దామోదరరెడ్డి అన్నారు. అరటితోటలో వేసి డ్రిప్ పైపులైను పనికిరాకుండా పోయిందని, మొత్తం రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు దామోదరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

సాగర్‌లో 'ఉస్తాద్' సినిమా షూటింగ్


విజయపురిసౌత్‌లోని ఫ్లై టెక్ ఏవియేషన్‌లో జరుగుతున్న చిత్రీకరణ

విజయపురిసౌత్: ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి కుమారుడు శ్రీ సింహా కోడూరి హీరోగా నిర్మితమవుతున్న ఉస్తాద్ సినిమా షూటింగ్ నాగార్జునసాగర్, విజయపురిసౌత్‌లోని ఫ్లై టెక్ ఏవియేషన్‌లో మంగళవారం జరిగింది. శ్రీసింహా కోడూరి 'మత్తు వదలరా', 'తెల్లవారితే గురువారం' వంటి సినిమాల్లో హీరోగా నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమాలో హీరో సరసన బలగం ఫేమ్ కావ్య కల్యాణ్‌రామ్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఫణిదీప్ తోట డైరెక్షన్‌లో ప్రొడ్యూసర్‌లు రజనీ కొర్రపాట, రాకేష్ గడ్డం, హిమాన్క్ దువ్వూరు ఆధ్వర్యంలో సినిమా రూపుదిద్దుకుంటుంది. మంగళవారంతో సినిమా చిత్రీకరణ మొత్తం పూర్తయిందని, గత సంవత్సరం ఆగస్టు నెలలో ప్రారంభమైన ఈ సినిమాను ఈ ఏడాది జూన్, జూలైలో విడుదల చేస్తామని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.